


పలుచోట్ల వర్షం


ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండల తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఎండ తీవ్రతతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తీవ్రమైన ఎండలకు ఇళ్లల్లో గోడలు వేడెక్కి ఫ్యాన్ గాలులు వెచ్చగా వస్తున్నాయి. బయటకు వద్దామంటే గాలి రాని పరిస్థితి. ఈ తరుణంలో రాత్రి 7.30గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ప్రజలకు కొంత ఉపశమనం మిగిల్చింది. మరోపక్క ఖరీఫ్ సీజన్లో రైతులకు ఈ వర్షం ఎంతో మేలు చేకూరుతుంది

కురుపాం : మండల కేంద్రమైన కురుపాంతో పాటు పలు గిరిజన గ్రామాల్లో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది .

క్షణక్షణం ఉత్కంఠ

నువ్వా..నేనా అన్నట్లు సాగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ఇటు అభ్యర్థుల్లోనూ, అటు ఆయా పార్టీల కార్యకర్తలు, ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ జరిగి సుమారు 20రోజుల తరువాత మంగళవారం ఫలితాలు వెల్లడి కానున్నాయి. పోలింగ్ జరిగిన 13వ తేదీ నుంచి అభ్యర్థులు పోలింగ్ బూత్‌ల వారీ అంచనాలు వేసుకున్నారు. గెలుపు తమదంటే తమదంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. శనివారం వెల్లడైన ఎగ్జిట్‌పోల్స్ సైతం వైసిపి, టిడిపి మధ్య పోటా పోటీగా ఉన్నాయి. పలు సర్వేలు వైసిపి గెలుస్తుందని, మరికొన్ని సర్వేలు టిడిపి గెలుస్తుందని వెల్లడించాయి. ఈనేపథ్యంలో అభ్యర్థుల్లో మరింత ఉత్కంఠ నెలకొంది. మంగళవారం మధ్యాహ్ననానికి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాతకాలు ఒక్కొక్కటిగా తేలనున్నాయి. సాయంత్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏ పార్టీ వచ్చే అవకాశం ఉందో కూడా తేలనుంది. ఇందుకు ఇంకా ఒక్కరోజే సమయం ఉండడంతో కేవలం రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలే కాకుండా ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, ఉపాధ్యాయులు, సాధారణ ప్రజానీకం కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



అందరి నోటా గెలుపు ధీమా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ వైసిపి, టిడిపి మధ్య హోరాహోరీగా పోరు నెలకొంది. 2,3 స్థానాల్లో వైసిపి గెలుపు అవకాశాలు దాదాపు ఖాయంగా ఉండగా, 4,5చోట్ల టిడిపికి గెలుపు అవకాశాలు ఉన్నాయి. మిగతా చోట్ల నువ్వానేనా అన్నట్లు పోటీ నెలకొంది. ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతోనే అని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఈనేపథ్యంలో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకం కానున్నాయి. మరో వైపు జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు బెట్టింగ్‌లు జరిగాయి. అభ్యర్థుల వారీ, మెజార్టీలు, అధికారంలోకి ఏ పార్టీ వస్తుంది ఇలా రక రకాలుగా బెట్టింగ్‌లు కాశారు. టిడిపి, వైసిపి ఒకదానికొకటి ప్రత్యామ్నాయ పార్టీలు కాదని, జాతీయ స్థాయిలో వీటి విధానం ఒక్కటేననే చర్చకూడా సాగుతోంది. గడిచిన ఐదేళ్ల కేంద్రంలోని బిజెపి చెప్పుచేతుల్లో వైసిపి పనిచేస్తే, అంతకు ముందు ఐదేళ్ల టిడిపి కూడా అదే బాటలో నడుచుకుందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, చట్టాలు ఎన్నో జరిగాయని చెప్పుకుంటున్నారు. ఈనేపథ్యంలో జాతీయ రాజకీయాలే మన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తాయని చెబుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో టిడిపితో బిజెపి పొత్తుపెట్టుకున్నప్పటికీ వైసిపి పట్ల వ్యతిరేక ప్రచారమేమీ చేయలేదు. దీన్ని బట్టి టిడిపితో పొత్తు, వైసిపితో తొత్తు అన్న చందంగానే వ్యవహరించిందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ పూర్వపరాల నేపథ్యంలో మన రాష్ట్రంలో వైసిపి, టిడిపిల్లో ఏపార్టీ అధికారంలోకి వచ్చినా బిజెపికే మద్ధతు పలికే అవకాశాలు ఉంటాయని, మన రాష్ట్రం మద్దతుతో కేంద్రంలో మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగ విలువలు మరింత దిగజార్చే ప్రమాదం ఉంటుందని ప్రజాధృక్కోణంగల మేధావుల్లో చర్చ నడుస్తోంది. గెలుపోటములపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు మరోవైపు సంబరాలకు రెడీ అవుతున్నారు. విజయోత్సవాలు, ఊరేగింపులు నిషేధంలో ఉన్నప్పటికీ మందుగుండు సామగ్రి మాత్రం సిద్ధం చేసుకోవడం గమనార్హం. కౌంటింగ్ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల సంఘం విధివిధానాలపై పార్టీల వారీగా శిక్షణ శిబిరాలు నిర్వహించుకున్నారు. అధికారులు ఇప్పటికే కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు. విధివిధానాలు, అనుసరించాల్సిన పద్ధతులపై జిల్లా కలెక్టర్ సారధ్యంలో సమావేశాలు పూర్తయ్యాయి. కౌంటింగ్ రోజూ 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

రేపు ఉదయం 8 గంటలకే ప్రారంభం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. ఎన్నికల లెక్కింపు ఈనెల 4న ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. లెక్కింపు ఏర్పాట్లపై ఆదివారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన కళాశాలలో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎం ఓట్ల లెక్కింపుతో సహా అరకు పార్లమెంటు నియోజక వర్గానికి చెందిన మొత్తం పోస్టల్ బ్యాలెట్లు, నాలుగు శాసన సభ నియోజక వర్గాల పరిధిలోని పార్లమెంటు ఇవిఎం ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపునకు 8 కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఒక కౌంటింగ్ మొత్తం 9 కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇవిఎం ఓట్ల లెక్కింపునకు ఎన్నికల కమిషన్ నిబంధనలు మేరకు 14 టేబుళ్లు, పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 20 టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రతి టేబుల్ వద్ద ఒక జిల్లా స్థాయి అధికారిని సహాయ రిటర్నింగ్ అధికారిగా, ఒక గెజిటెడ్ అధికారి, ఇతర సిబ్బంది ఉంటారని ఆయన తెలిపారు. శాసన సభ నియోజక వర్గం లెక్కింపు కేంద్రంలో రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద రెండు టేబుల్‌లు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ఏర్పాటు చేశామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వద్ద అభ్యర్థి గాని, ప్రధాన ఏజెంట్ గానీ ఉండొచ్చని పేర్కొన్నారు. ఇవిఎం ఓట్ల లెక్కింపు టేబుల్ వద్ద ఒక్కొక్క ఏజెంట్ ఉండవచ్చని చెప్పారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, రిటర్నింగ్ అధికారి వేదిక వద్ద జరిగే పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వద్ద ఇద్దరు మైక్రో అబ్జర్వర్ ఉంటారని చెప్పారు. ప్రతి టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ సహాయకులు ఉంటారని ఆయన తెలిపారు. 181 మంది కౌంటింగ్ సూపర్వైజర్ లు, 213 మంది కౌంటింగ్ సహాయకులను నియమించినట్లు తెలిపారు. అరకు పార్లమెంటు నియోజక పరిధికి సంబంధించి 21,462 పోస్టల్ బ్యాలెట్ లు, 1165 సర్వీస్ ఓట్లు ఇప్పటి వరకు అందాయని ఆయన తెలిపారు. 511 మంది ఎన్నికల ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ రెండు రౌండ్లులో ముగుస్తుందని, ప్రతి రౌండ్‌కు రెండున్నర నుండి మూడు గంటలు సమయం పట్టొవచ్చని చెప్పారు. పార్వతీపురం నియోజకవర్గం 17 రౌండ్లు, సాలూరు 18 రౌండ్లు, కురుపాం 20 రౌండ్లు, పాలకొండ 21 రౌండ్లు లెక్కింపు జరుగుతుందని చెప్పారు. లెక్కింపు సిబ్బంది తుది ర్యాండమైజేశన్ ఈనెల 4వ జరుగుతుందన్నారు.

జిల్లాలో 144 సెక్షన్

జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమల్లో ఉందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. కౌంటింగ్ అనంతరం పరిస్థితుల రీత్యా కొనసాగింపుపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. లెక్కింపు కేంద్రం వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. 158 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లు నిరంతర నిఘాలో ఉంటాయని వివరించారు. ఇతరులు డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగరవేయకుండా నో ఫ్లై జోన్‌గా ప్రకటించామని చెప్పారు. ఎస్‌పి, ఎఎస్పీ, ముగ్గురు డిఎస్పీలు, 17 మంది సిఐలు, 24 మంది ఎస్‌ఐలతో సహా 500 మంది పోలీసు బందోబస్తు, ఒక కేంద్ర బలగంతో బందో బస్తు ఉందన్నారు. అదనంగా మూడు కేంద్ర బలగాలు సోమవారం జిల్లాకు చేరుకుంటాయని, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పోలీసు పికెటింగ్ జరుగుతోందన్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అల్లర్లు జరుగుతాయని అంచనాలు లేవని, ఇప్పటి వరకు ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు అంతా సహకరించారని ఆయన పేర్కొన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్ వద్ద ఒక సిఐ స్థాయి అధికారి బందోబస్తు పర్యవేక్షిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అరెస్టు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం చుట్టుపక్కల గ్రామాల్లో ఇతర గ్రామస్తులు ఉంటే తక్షణం విడిచి వెళ్లాలని ఆయన చెప్పారు. ర్యాలీలు, విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచాల వినియోగాన్ని నిషేధించినట్లు తెలిపారు.

ప్రత్యేక మార్గాలు

కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చే సిబ్బందికి, ఎన్నికల ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. సూచికలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలీసు సిబ్బంది మార్గనిర్దేశం చేస్తారని వాటిని అనుసరించాలని ఆయన పేర్కొన్నారు.

నేటి సాయంత్రం నుండి డ్రై డే

జిల్లాలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు మద్యం విక్రయాలపై నిషేధం విధించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు.

ఇద్దరు సాధారణ ఎన్నికల పరిశీలకులు

లెక్కింపు సమయంలో ఎన్నికల కమిషన్ నియమించిన ఇద్దరు సీనియర్ ఐఎఎస్ అధికారులు సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా హాజరు కానున్నారని ఆయన చెప్పారు. ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారని ఆయన తెలిపారు.



ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు

కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలు, ఎలక్ట్రానిక్ వాచ్‌లు తదితర ఏ ఎలక్ట్రానిక్ పరికారాలు అనుమతించడబడవన్నారు. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17 -సి ఫారం, తెల్ల కాగితం మాత్రమే తేవాలని ఆయన స్పష్టం చేశారు.

తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఒకేఒక్క ఆశ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ఆదాయం తెచ్చి పెడుతోంది. తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు.. మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ.. అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి.



ప్రయివేటు పాఠశాలల్లో పుస్తకాల దందా

- పాఠ్య, నోట్‌పుస్తకాలపై అడ్డగోలు వ్యాపారం
- వేలకువేలు దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ



ప్రయివేటు పాఠశాలలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయాల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ.. ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తున్నాయి, దీంతో తప్పక అడిగిన డబ్బులు చెల్లించి షాపుల్లో మాదిరిగా ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో 600 వరకు ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. మౌలిక వసతుల లేమి, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా... గరిష్ఠంగా రూ.1500 మించి ఉండదు. అన్నీ కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రయివేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కెజి, యుకెజి తరగతులకే రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. పెద్ద తరగతులకు రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దాడులు చేస్తూ పట్టిస్తే, నామమాత్రంగా అధికారులు వెళ్లి చర్యలు తీసుకుంటున్నారు. అంతేతప్ప దోపిడీని అరికట్టే చర్యలు మాత్రం జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు.

అప్పడే కోడ్ వదిలేసిందా

నేతల విగ్రహాలకు తొలగిన ముసుగులు

ప్రజాశక్తి-పాలకొండ

సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. కానీ ఇంకా ఫలితాలు వెలువడలేదు. అయితే స్థానిక నగరపంచాయితీ కార్యాలయం వద్ద గల నాయకుల విగ్రహాలకు తొడిగిన ముసుగులు మాత్రం తొలగించేశారు. నిత్యం ఆ విగ్రహాల ముందు నుండే కార్యాలయంలోకి రాకపోకలు సాగించే అధికారులకు, ఉద్యోగులకు ఇదేం పట్టనట్టు వ్యవహరించడం కొసమెరుపు.



నగర పంచాయతీ కార్యాలయం వద్ద నాయకుల విగ్రహాలపై తొలగించిన ముసుగులు

గిరిజన యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలోని గొల్లి వీధిలో నివాసం ఉంటున్న గిరిజన యువతి చోడిపిల్లి ఉష(20) ఆదివారం ఆత్మహత్య కు పాల్పడినట్లు టౌన్ ఎస్‌ఐ కెవి సురేష్ చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గడివలస గ్రామానికి చెందిన ఉష పట్టణంలో ప్యారడైజ్ హెటల్ లో పని చేస్తున్నదని చెప్పారు. ఆమె తో పాటు మరో ఇద్దరు యువతులు కూడా అద్దె ఇంట్లో ఉంటున్నారని తండ్రి నారాయణ చెప్పినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్‌ఐ కెవి సురేష్ చెప్పారు.

నాడు-నేడు పనులు పూర్తయ్యేదెప్పుడు?

- మరో 9 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం
- మందకొడిగా సాగుతున్న పనులు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- ప్రకటనకే పరిమితమైన ప్రభుత్వం

ప్రజాశక్తి - వీరఘట్టం

పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా నాడు -నేడు, మనబడి కింద పాఠశాలలు అభివృద్ధి పర్చేందుకు వీలుగా ప్రభుత్వం నాడు- నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అధికారుల అలసత్వం వల్ల సకాలంలో బిల్లులు చెల్లింపులు జరగక ఈ పనులు మందకొడిగా సాగుతున్నాయి. పాఠశాలలు పున: ప్రారంభానికి ఇంకా 9రోజులే గడవు ఉంది. పనులు పూర్తకాకపోవడంతో ఈ ఏడాదీ అసౌకర్యాల మధ్య చదువులు తప్పేలా లేవని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని నాడు నేడులో భాగంగా 2022లో రెండో విడత కింద 29 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో తలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్సిపురం, కత్తుల కవిటి, రేగులపాడు కెజిబివి, బిటివాడ, నీలానగరం, కంబరవలస, తెట్టంగి, వండువ, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలతో పాటు బూరుగ, చలివేంద్రి, బిటివాడ, కడకల్లా, చినగోర కాలనీ, వీరఘట్టం, బూరుగ, ఎం.రాజపురం, బొడ్లపాడు, చిదిమి, కె.ఇచ్ఛాపురం, నడిమికెళ్ల, తదితర పాఠశాలతో పాటు కంబరవలస, కొట్టు గుమ్మడ1, 2, నర్సిపురం 2, తలవరం 2, అంగన్వాడి కేంద్రాల్లో సుమారు రూ.983.13 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకూ మండల కేంద్రంలోని కూరాకుల వీధి పాఠశాల మినహా ఎక్కడా పనులు పూర్తికాలేదు. దాదాపుగా రెండేళ్ల కావస్తున్నప్పటికీ ప్రభుత్వ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల నాడు నేడు పనులు ముందుకు సాగకపోవడంతో పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

మందకొడిగా సాగుతున్న పనులు

మండలంలోని కత్తులకవిటి, కంకంబరవల, నీలానగరం, బిటివాడ, కేజీబీవీ, తెట్టంగి, తలవరం తదితర పాఠశాలలో ఉన్న గదులు సరిపోకపోవడంతో అదనపు తరగతి గదులు నిర్మించేందుకు నాడు-నేడు కింద పనులు చేపట్టారు. కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునాదులకే పరిమితం తప్ప ముందుకు సాగలేదు. మిగిలిన చోట వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. మరో 12 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయమై ఎంఇఒ- 2 ఆనందరావు వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా పెండింగ్లో ఉన్న నాడు-నేడు పనులు పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ సహాయకులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నిధులు కూడా పుష్కలంగా ఉన్నట్లు ఆయన వివరణ ఇచ్చారు.



కంబర వలసలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో అర్థాంతరంగా నిలిచిన పనులు

పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ఇజ్రాయిల్ ప్రభుత్వం పాలస్తీనా ప్రజలు జరుపుతున్న మారణ హెూమం ఆపాలని, పాలస్తీనా ప్రజానీకానికి మన దేశప్రజలంతా అండగా నిలవాలని కోరుతూ పాచిపెంట మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ ఆవరణలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం జరిగింది. గిరిజన సంఘం నాయకులు దీసరి వసంతరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడారు. స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుకు మద్దతుగా నిలవకుండా మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్ ప్రభుత్వానికి అండగా నిలుస్తూ ఈ దాడులకు పాల్పడడం చాలా బాధాకరమన్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వానికి ఆయుధాలు సరఫరా నిలిపివేయాలని, ఇజ్రాయిల్‌కు అమెరికా అతిపెద్ద మద్దతుదారుడుగా నిలిచి దాడులకు పాల్పడడం సరైంది కాదని అన్నారు. నిరాయుధులైన పాలస్తీనాల్లోని గాజాలో ఉన్న వ్యక్తులపై దాడులు జరుగుతున్నాయని, ఇది ఆమోదయోగ్యం కాదని, ఇటువంటి దాడులను ప్రపంచ దేశాలు ఖండించాలని పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం పాలస్తీనాకు తన సంఘీభావాన్ని తక్షణమే ప్రకటించాలని ఇజ్రాయిల్‌తో అన్ని రక్షణ భద్రత ఒప్పందాల నుంచి వైదొలగాలని అన్నారు. గత 8నెలలుగా పాలస్తీనాలో ఉన్న గాజాపై కొనసాగుతున్న దాడిని శాశ్వతంగా విరమించాలని అక్కడ ప్రజలకు రక్షణ కల్పించాలని, గాజా నుంచి ఇజ్రాయిల్ పూర్తిగా వైదొలగాలని గాజాను పునర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

కౌంటింగ్ రోజు ప్రశాంతంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ముందస్తు సమాచారం లేకుండా ఎటువంటి ర్యాలీలు నిర్వహించకూడదని డిఎస్పీ జివి కృష్ణారావు ప్రజలకు సూచించారు. ఆదివారం రాత్రి కురుపాంలోని గౌడు వీధిలో ఎన్నికల ఫలితాల రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 144 సెక్షన్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ముందస్తు సమాచారం లేకుండా ఎటువంటి ర్యాలీలు, బాణాసంచాలు, డిజె సౌండ్లో వంటివి ఉపయోగించ కూడదన్నారు. ప్రజలంతా సోదరా భావంతో ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలకు విరద్ధంగా వ్యవహరిస్తే ఎంత వారిపైనైనా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్విన్ పేట సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై షణ్ముఖరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డిఎంఒ జగన్మోహనరావు

పేదలకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అదివారం ఆయన తన పుట్టినరోజు సందర్భంగా అందుబాటులో ఉన్న పేదలకు వస్తు, వస్త్ర రూపంలో చేసే దానం కొంతలో కొంత ఆదుకుంటుందన్న సదుద్దేశంతో మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన పనసభద్ర, కోరి గ్రామాల్లో పేదలకు, ఒంటరి మహిళలకు, వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. అక్కడ చిన్నారుల మధ్య పుట్టిన రోజు కేక్ కట్ చేసి వారికి మిఠాయిలు పంచి పెట్టి వారితో కాసేపు సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వృత్తిలో సేవా భావంలో ఆయన మాకెంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. పేదలకు సేవ చేయడం ఎంతో సంతృప్తి నిస్తుందన్నారు. అనంతరం అక్కడ గర్భిణులకు, చిన్నారులకు ఆరోగ్య పరిశీలన చేసి తగు సూచనలు చేశారు. రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమెకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జయగౌడ్, ఎస్.అనంతరావు, ఆశా కార్యకర్త ఆర్.లక్ష్మి, సిహెచ్‌డబ్ల్యూలు తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ జగదీష్‌నాయుడు

దేవనాపురంలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దేవనపురంలో చంద్రమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంటన్‌ను స్థానిక ఎస్సై ఎం.జగదీష్ నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చుట్టుపక్క గ్రామాల నుంచి 70 టీములు 15రోజులు పాల్గొంటాయన్నారు. ఆదివారం మామిడి జ్వాల, కంబగూడ జట్లు తొలుత తలపడ్డాయి. ఆ తర్వాత కోడిశ, వలగజ్జి పోటీపడ్డాయి. ఓంద్రుజోల, పాత పనుకువలస జట్లు తలబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్సై జగదీష్ మట్లాడుతూ ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్ల వల్ల యువతలో ఉల్లాసం, ఉత్సాహంతో పాటు కొత్త గ్రామస్తులతో స్నేహాలు బలపడతాయన్నారు. శరీరం కూడా ఫిట్నెస్‌గా ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూరిబాబు, ముటక రవి, ఎస్‌బిఐ బ్యాంకు క్యాషియర్ మూటక శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రోగులకు తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

కంటి ఆపరేషన్లకు 40మంది ఎంపిక

ప్రజాశక్తి - మక్కువ

విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల్లో 40 కంటి శుక్లాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆదివారం స్థానిక బూసమ్మ కంటి చికిత్స కేంద్రం వద్ద ఈ ఉచిత పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికైన 40 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యులు దేవి, గిరిజ, మంజుల, స్థానిక ఆప్తామాలజిస్ట్, మహేష్, మల్లేశ్వరరావు, పలువురు రోగులు పాల్గొన్నారు.


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కాసేపు హాయిహాయిగా...

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం కావడం, అందులో వేసవి సెలవుల చివరి వారం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, పర్యాటకులతో పార్కు పోటెత్తింది. వేసవి ఎండ తీవ్రతగా ఉండడంతో కాసేపు సేద తీర్చుకోవడానికి పర్యాటకులు జలవిహార్ వద్ద బోటు షికారు చేస్తూ హాయ్ హాయిగా గడిపారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కెర్లు కొట్టారు. చిన్నారులు మినీ బోటింగ్ చేశారు. మరి కొంతమంది పర్యాటకులు ఫైవ్ డి థియేటర్ ను వీక్షించారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాల ఊగారు. ఆనంద్ విహార్ వద్ద డ్యాన్సులు వేశారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

జోరుగా బెట్టింగులు

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

ఇటు కురుపాం నియోజకవర్గంలోనూ అటు రాష్ట్రంలోనూ వైసిపి, టిడిపి కూటమి పార్టీ జయాపజయాలపై మండలంలో జోరుగా బెట్టింగులో సాగుతున్నాయి. మంగళవారం జరుగు ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఇరు పార్టీల నేతలు గెలుపు తమదంటే కాదు తమదేనని లక్షలాది రూపాయలు పందాల రాయుళ్ల చేతులు మారాయి. మరోపక్క నియోజకవర్గంలోని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి తన గెలుపుపై ధీమాతో ఉండగా, మరోవైపు టిడిపి అభ్యర్థి తోయక జగదీశ్వరి విజయకేతనం ఎగరవేస్తారని ఆ పార్టీ అభిమానులు ధృడ నమ్మకంతో ఉఆన్నరు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో కోట్లాది రూపాయలు బెట్టింగులు కాస్తూ నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా పార్టీల గెలుపు ఓటములపై ప్రజలు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు. ఏదేమైనా ఎవరి జాతకం ఏమిటో అనే విషయం తేలాలంటే మరో 24 గంటలు ఎదురు చూడాల్సిందే.

పడిపోయిన పనస ధర

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థికంగా చేయూతనిచ్చే పంట పనసకాయ. వీటిలో బురద పనస, కజ్జపనస రెండు రకాలు ఉంటాయి. సీతంపేట ఏజెన్సీలో ఈ పంట సుమారు 700 ఎకరాల్లో సాగువుతోంది. అయితే ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పనసకాయ పంట దిగబడి తగ్గింది. దీంతో వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో పనస ధర పడిపోయింది. ఒకవైపు పంట దిగుబడి లేక మరోవైపు మార్కెట్ ధర లేకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ధోనుబాయి, శంభాం, మర్రిపాడు కుసిమి, బుడగరాయి తదితర ప్రాంతాల్లో ఈ పంట ఎక్కువగా సాగవుతోంది. పనసకాయలు ఒడిశాలో ప్రతి శుభకార్యాలకు, హోటల్లో వండుతారు. అంతేకాక పనసకాయ బిర్యానీ చేస్తారు. ఒక మాటలో చెప్పాలంటే ఒడిశా వాసులు పనసకాయ అంటే చెవి కోసుకుంటారు. ఈ రాష్ట్రం నుండి కటక్, భువనేశ్వర్, పర్లాకిముడి, ఆంధ్రా, తెలంగాణ, విజయవాడ, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాల నుండి సీతంపేట, కుసిమి, మర్రిపాడు సంతలకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తారు. అయితే కాయ లెక్క అంచనాను రూ.50 నుంచి రూ.60 వరకు కారు చౌకగా కొనుగోలు చేసి పట్టణాల్లో కిలోల చొప్పున విక్రయిస్తారు. అంతేకాకుండా పనసపండును కిలో లెక్క లేదా పనస తోనలు కిలోల చొప్పున విక్రయిస్తారు. దీంతో వ్యాపారులు లాభాలు అర్జిస్తారు... రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మార్కెట్ ధర కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.


సంతలో పనస పండు విక్రయిస్తున్న రైతు

కంపుకొడుతున్న పల్లెలు

వీధుల్లో పేరుకుపోయిన చెత్త చెదారాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

పల్లెల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో పల్లెల్లో ఏ వీధిని చూసినా కంపు కొడుతూ దర్శనమిస్తున్నాయి. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు. ఒకప్పుడు పల్లెలు చూస్తే ఆహ్లాదకరంగా కనిపించేవి. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. మండల కేంద్రమైన వీరఘట్టం సిబిఎం, శైల, మర్రి, గాజుల, బాబు జగజీవన్ రాం కాలనీ, గెడ్డ కాలనీ, తదితర వీధులతో పాటు ఎలీషా పురం, నడుకూరు, చిట్టపూడివలస తదితర గ్రామాల్లో ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తొలగించడంలేదు. దీంతో మురుగు నీరంతా నిల్వ ఉండడం వల్ల వాటిపై దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారినపడే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని చెబుతున్న పాలకులు, అధికారులు చేతల్లో పనులు ఎక్కడా కనిపించడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో జ్వరాలు విజృంభించే అవకాశలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అక్కడక్కడా జ్వరాలు బారినపడి పట్టణ ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించి వ్యాధులను నయం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యం మెరుగుపర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


బాబూ జగ్జీవన్‌రాం కాలనీలోని కాలువలో పేరుకుపోయిన మురుగునీరు

పార్వతీపురం- విజయవాడ సర్వీసులు నడపాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఆర్‌టిసి డిపో నుంచి విజయవాడకు బస్సు సర్వీసులు నడపాలని సిపిఎం జిల్లాకమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కోరారు. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఉదయం పూట మాత్రమే విజయవాడకు వెళ్లే ఒకే ఒక్క బస్సు ఉందని, సాయంత్రం, రాత్రి సమయాల్లో గతంలో ఉండే సర్వీసులను రద్దు చేయడం దారుణమన్నారు. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను దోచుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికే రాయగడ-విజయవాడ రైలు రద్దు కావడంతో ప్రయాణికులు బస్సులనే ఆశ్రయిస్తున్నారన్నారు. ఇదే అదునుగా అనేక ప్రైవేట్ ట్రావెల్స్ భారీ ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. కావున ఆర్‌టిసి అధికారులు స్పందించి సాయంత్రం, రాత్రి వేళ్లలో విజయవాడ, హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు సర్వీసులను నడపాలని కోరారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

వృద్ధులను ఆదుకోవడం గొప్ప విషయమని స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ పైడి రాజు అన్నారు. తుమ్మికాపల్లి వద్ద గల ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ్ హరికుమార్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు కవి చెరుకూరి తరుణ్ దంపతులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రమణ, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి పాల్గొని వృద్ధులకు సరుకులను అందించారు. ట్రస్ట్ ట్రెజరర్ విశ్వనాధ శ్రావణ్ కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని మండలంలోని కత్తులకవిటి సచివాలయం పరిధి జరడ గ్రామస్తులు కోరుతున్నారు. కురుపాం మండలం తిక్కర పంచాయితీ జరడ కాలనీ నుండి ఇక్కడకు పదేళ్ల క్రితం 16 కుటుంబాలు వలసవచ్చామని, గ్రామంలో ఒక వీధిలైట్లు తప్ప కనీస అవసరమైన తాగునీటి సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. గ్రామంలో ఓ సంస్థకు చెందినవారు బోరుబావి ఏర్పాటు చేసినప్పటికీ అవి తాగేందుకు పనికి రాకపోవడంతో గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న వంకాయలగెడ్డ, కత్తులకవిటి గ్రామాలకు మోటర్ సైకిల్‌కు ప్లాస్టిక్ కేనులు కట్టి నీరు తెచ్చుకొని దాహం తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు ఎం.గోవింద, ఎ.కేశవరావు, చిన్నారావు, సన్నాయి, ఆజాద్, సుందర్రావు, అయ్యన్న, తదితర గిరిజన్లో కోరారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని జరడ గ్రామ గిరిజనులు కోరుతున్నారు.


కొమరాడలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - కొమరాడ

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై నీలకంఠం తెలిపారు. ఆదివారం కొమరాడ అంతర్రాష్ట్ర రహదారిలో స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టామన్నారు. నిషేధిత డబ్బు, మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నామని అన్నారు. మండలంలోని మూడు గ్రామాల్లో పికెట్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో గ్రామాలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, గొడవలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల నియనిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలన్నారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. మాదిలింగి వనం, పెద్ద మార్కొండపుట్టి గ్రామాల్లో పికెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు కౌంటింగ్ పూర్తయిన తర్వాత కూడా ప్రజలు ప్రశాంతంగా ఉండాలి తప్ప ఎటువంటి అల్లర్లు గొడవలు చేయకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాలకొండ : ఈనెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144వ సెక్షన్ అమల్లో ఉందని, అలాగే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ పార్టీ గెలిచినా కూడా గ్రామాల్లో ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, అలాగే ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడరాదని సిఐ చంద్రమౌళి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసమూహంతో కూడుకున్న సభలు, సమావేశాలు నిర్వహించరాదని, జనాలు గుంపులుగా ఉండరాదని తెలిపారు. అలాగే బాణాసంచా, టపాసులు పేల్చరాదని డిజె సౌండ్లతో ఊరేగింపులు ఉండరాదని, 144వ సెక్షన్‌కు అనుగుణంగా వ్యవహరించాలని, హద్దులు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్రమణలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ స్థలాలు, చెరువులు అక్రమిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిలటరీ కాలనీ వద్ద చెరువును ఆక్రమణ చేసేందుకు చదును చేయడం అన్యాయమన్నారు. మున్సిపాలిటీలో కారిపోనుబంద, పక్షులుబంద, శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు పక్కనున్న బంద ఆక్రమణకు గురైనా చర్యలు లేవన్నారు. చెరువులు అక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉన్న రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురవుతు న్నాయని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆయనతో ట్రైలర్ సంఘం గౌరవ అద్యక్షులు నరం అప్పారావు ఉన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు లవ్ రీడింగ్‌లో భాగంగా సంస్కృత పండితులు సతీష్‌కుమార్ శ్లోకాలు, వ్యాకరణాలను విద్యార్థులకు బోధించారు. అనంతరం చదరంగం క్యారం బోర్డు పోటీలు నిర్వహించినట్లు శాఖాగ్రంథా లయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరం 19వ రోజు డ్రాయింగ్ మాష్టర్ జి.మురళి అధర్వంలో పిల్లలకు డ్రాయింగ్, మట్టి బొమ్మల పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శ్లోకాలు నేర్పిస్తున్న సతీష్


పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - కొత్తవలస

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని బెటర్ ఎర్త్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నారు. ఆదివారం బెటర్ ఎర్త్ ఇండియా ఛారిటబుల్ ట్రస్ట్- పర్యావరణ పరిరక్షణ, సోషల్ వర్క్ లాభాపేక్ష లేని సంస్థ బీచ్ క్లీన్ అప్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు సహా ఇరవై మంది వాలంటీర్ల బృందం పాల్గొంది. విశాఖపట్నంలోని విక్టరీ ఎట్ సీ మెమోరియల్ ముందు బీచ్‌లో ఈ డ్రైవ్ నిర్వహించారు. బీచ్‌లో విందు చేసేవారు ప్లాస్టిక్, పేపర్లను ఉపయోగించడం వల్ల చాలా వరకు వ్యర్థాలు పేరుకుపోతున్నాయని గుర్తించి వాటిని ఒక కిలోమీటరు పొడవును రెండు గంటలలోపు ఏరివేశారు. 2020 నుండి పర్యావరణ సమస్యలపై తమ ట్రస్ట్ దృష్టి సారిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో ఆదివారం క్రీడాకారులకు వైద్యులు డాక్టర్ ఎస్ వి సత్యశేఖర్, ఆనల రమేష్, చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, తల్లిదండ్రులు చేతుల మీదుగా క్రీడా దుస్తుల పంపిణీ చేశారు. అనంతరం శిక్షణ శిబిరంలో జరుగుతున్న టోర్నమెంటులో ఫైనల్స్‌కు చేరుకున్న క్రీడాకారులు వారు ప్రదర్శిస్తున్న ఆటను సత్య శేఖర్ తిలకించి, క్రీడాకారులకు స్పోర్ట్స్ ఇంజురీస్‌పై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్ మహమ్మద్ అస్లాం, బి.హారిక,పాల్గొన్నారు.

ఫలితాలపై సంయమనం పాటించాలి

రామభద్రపురం : ఎన్నికల ఫలితాలపై సంయ మనం పాటించాలని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాస రావు సూచించారు. ఆరికతోట ఓల్డ్ బజార్ సెంటర్లో సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చావు, పుట్టక గెలుపు, ఓటమి సర్వ సాధారణమని ఫలితాల రోజున కవ్వింపు చర్యలకు దిగకుండా సమానత్వ ధోరణితో మెలగాలని హితవు పలికారు. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని విజయోత్సవాలు, బాణాసంచా, సౌండ్ సిస్టమ్, ర్యాలీలు నిర్వహించరాదని అన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించక చట్టాలకు లోబడి నడుచుకోవాలన్నారు. తమ సిబ్బంది ఆధ్వర్యంలో కార్డన్ తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని ప్రతీ వాహనానికి తప్పనిసరిగా సంబధిత పత్రాలు ఉండాలని లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరా దని, మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావుకు వినతిని అందజేస్తున్న ఆదివాసీ ఉద్యోగులు

ఆదివాసీ ఉద్యోగుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపి ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావును ఆయన క్యాంప్ కార్యాలయంలో ముంబై సెంట్రల్ యునివర్సిటీ ప్రొఫెసర్, ఆలిండియా ఆదివాసీ ఉద్యోగుల ఫెడరేషన్ ఆర్గనైజర్ డాక్టర్ చేతన్ కుమార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ స్థాయిలో ఆదివాసీ ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వివిధ రాష్ట్రాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో జరిగే సదస్సుకు ఆయన్ను అతిథిగా ఆహ్వానించారు. ఎపి ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఎఎస్ఆర్ జిల్లా చైర్మన్ రామారావు దొర మన్యం ప్రాంతంలో ఆదివాసీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజర్ సోమేలి సింహాచలం, సభ్యులు సుబ్బారి గురుదొర, చెర్రీకి సింహాచలం, వంతల కామేశ్వరరావు, మాసాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరమణ, భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కంది వెంకటరమణ, బి.భాస్కరరావు ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు ఎస్‌వి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా వారిని ఎన్నుకున్నారు. వారితో రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి నిరంతరం పనిచేస్తామని సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదార్లకు నష్టం జరుగుతున్నా, చోద్యం చూస్తున్న ఉద్యోగ సంఘాలకు భిన్నంగా ఎపిజిఇఎ ముందుకు వెళ్తుందని చెప్పారు. ద్యోగుల గొంతుకగా ముందుకు వెళ్లి ఉద్యోగులు గర్వించే విధంగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం తెలుగు సంవత్సర కేలండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారం చోరీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం అర్ధరాత్రి 1.15 నుంచి 2గంట ప్రాంతంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి గంట లాజరు ఇంట్లో దొంగతనం జరిగింది. రాత్రి ఎస్సీ కాలనీలో విద్యుత్ సమస్య ఉండడంతో ఉక్కపోతకు బయట వరండాలో పడుకున్నారు. అర్ధరాత్రి చలి వేయడంతో దుప్పటి తెచ్చేందుకు ఆయన భార్య ఇంట్లోకి వచ్చి చూడగా బెడ్ రూమ్‌లో ఉన్న వస్తువులు చిందర వందరగా ఉన్నాయి. వెంటనే కేకలు వేయగా ఇంట్లో వాళ్ళు ఉలిక్కి పడి అందరూ లేచి చూసే సరికే దొంగలు వెళ్లిపోయారు. సెల్ఫ్ అల్మారాలో వున్న 5 తులాల బంగారు అభరణాలు (నక్లీసు, నల్ల పూసలు హారం), పది తులాలు వెండి పట్టీలు, రెండు సెల్ ఫోన్లు, రూ.13,500 నగదు పట్టుకొని పోయారు. దొంగతనం పక్కా ప్రణాళికగా జరిగిందని స్థానికులు భావిస్తున్నారు. ఈ దొంగతనం చుట్టూ పక్కల తెలిసిన వారే చేసి వుండవచ్చు అని అనుమానిస్తున్నారు. పార్వతీపురం పోలీసులకు సమాచారం ఇవ్వగా, వెంటనే వచ్చి కేసును దర్యాప్తు చేస్తున్నారు. రూరల్ ఎస్సై దినకరన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ లీకై రేకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - కురుపాం

అగ్నిప్రమాదంలో రేకిల్లు దగ్గమై లక్ష రూపాయలు ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండలంలోని నీలకంతాపురం పంచాయతీ మామిడి మానుగూడలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం బిడ్డిక సీమయ్య ఇంటిలో వంట గ్యాస్ లీకై ఇంటికి నిప్పంటుకుంది. దీంతో ఇంట్లో సామగ్రి మొత్తం కాలిపోవడంతో సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదం సంభవించిన సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణ నష్టం జరగకుండా పెద్ద ప్రమాదం తప్పిందని, అధికారులు స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు, గ్రామస్తులు కోరుతున్నారు.


అగ్నిప్రమాదంలో బూడిదైన ఇల్లు